# ఛాయలు

ఎమ్మెస్సార్. మూర్తి

"నేను ఇన్నాళ్ళనుంచీ చెప్తుంటే మీ చెవి కెక్కటం లేదు."–అంది ఛాయాదేవి.

"ఏమిటది? " కోటు విప్పుతూనే వెనక్కి తిరిగి చూశాడు, భార్యవైపు కృష్ణానందం.

"బయట పిల్లలున్నారు, అలా బెడ్‌రూంలోకి పదండి....చెప్తాను."

"అబ్బబ్బ. హెడ్ లైనులా ఒక్క ముక్కలో చెప్పకుండా–మిగతాది మూడో పేజీలో రెండో కాలంలో అన్నట్టుంటాయి నీకబుర్లు. ఇంటికీ ప్రెస్సుకీ తిరగాపోయి అసలు విషయమేమిటో కంపోజు చేసుకోలేక చస్తున్నాను," ఎడిటర్ కృష్ణానందం బరువుగా ఉన్న పాంట్ జేబులోంచి మడత పెట్టిన కాగితాలన్నీ తీసి టేబిల్ మీదకి విసిరేశాడు. ఫోను మోగుతుంటే మరింత చిరాకు పడ్డాడు.

"నాన్నా...నీకుఫోను అన్న సునందిని పిలుపువిని డ్రాయింగ్ రూమ్‌లోకి అడుగులు వేశాడు. ఫోను అందుకొని, కూతురువేపు చూస్తూ "హలో..." అన్నాడు.

○ ○ ○

భోజనాల దగ్గర మళ్ళీ ప్రస్తావించింది ఛాయాదేవి.

"అబ్బ. ఉండవే...నీఅందాన్ని చూడాలో అన్నం తినాలో తెలీక అవస్థ పడుతున్నాను. సినిమాకి వెళ్ళి వచ్చారా... లేక వెళ్ళబోతున్నారా...? "అన్నాడు పరిశీలనగా చూస్తూ. తెల్లగా...సముద్రం వడ్డున కట్టిన ఉప్పునీటి చారల్లా మెడలోతుల్లో స్పష్టంగా కనబడుతున్న పౌడరు ఛాయలనుద్దేశించి. ఛాయాదేవి కట్నం కాకుండా–ఈ ఎడిటోరియల్ ఉద్యోగం కూడా వెంటతెచ్చింది. కానీ కృష్ణానందానికి అవన్నీ తీసుకోవాలనీ ఏం లేదు. అంతమాత్రంచేత "వద్దు" అనే దీక్ష కూడా లేదు.

"ఏమిటీ...ఇప్పుడు చెప్పు..." అన్నాడు కృష్ణానందం పెరుగుమీది మీగడ చూపుడువేలితో లాగి నాలిక మీద రాసుకుంటూ...

"ఏవుందీ... ఇదిగో ఈ కట్ట చూడండి..."

"ఏవిటదీ ఉత్తరాల్లా ఉన్నాయి."

"అవును ఉత్తరాలే– మీకు కాదు."

భార్యలోని విరుపుడు మాటకి నొసలెగరేశాడు కృష్ణానందం

"ఆఁ...మొత్తం ఎనిమిది ఇన్‌లాండ్ ఉత్తరాలు." రహస్యంగా చెవిదగ్గరికి వంగి "మొన్న వాళ్ళ కాలేజీ యానివర్సరినాడు ఇది డ్యాన్సు చేసిందిగా..."

"యానివర్సరీకి... ఇన్‌లాండు ఉత్తరాలకి..." మంచినీళ్ళు త్రాగడంకోసం ఆగాడు కృష్ణానందం.

"సంబంధం లేదు కానీ– సునందిని పెళ్ళికీ, ఈ ఉత్తరాలకీ సంబంధం ఉంది గనక. ఓ మంచి సంబంధం మీరు తక్షణం తేకపోతే– ఈవేళొచ్చిన ఈ ఎనిమిది ప్రేమలేఖల్లో కనీసం అది మూడింటికైనా రిప్లై వ్రాస్తుంది.

"చదివిందా ?" అడిగాడు ఆత్రంగా.

"లేదు లెండి."

కృష్ణానందానికి ముద్ద మింగుడుపడలేదు.

○ ○ ○

మంచంమీద వాలి ప్రక్కగాఉన్న టేబిల్ లైటు స్విచ్ వేసికొని ఉత్తరాలు చేతిలోకి తీసుకున్నాడు కృష్ణానందం. తెరిచి ఉంచిన ఉత్తరాన్ని విప్పి చదవడం మొదలెట్టాడు. ప్రెస్ మాటరు ఎడిట్‌చేసే అలవాటుతో ఫైబర్ పెన్నుని అందుకుంది అతనిచేయి.
"మైడియర్ సునందా ..."

కృష్ణానందం ఉలిక్కిపడ్డాడు. నాలుగురోజుల క్రితమే సునందిని తనకాలేజి యానివర్సరీకి డ్యాన్సు చేసింది. ప్రేక్షకుల్లోంచి వచ్చిన ఈలలు-కేకలు-అపలాజు అక్కడబాగానేఉంది కానీ – మరీ ఆ జానపద నృత్యంపాట వాళ్ళందరిచేత లయగా చప్పట్లువేయిస్తే అప్పుడు తాను బిత్తరపోయాడు. సునందినికి కంగ్రాట్స్ చెప్పేవాళ్ళు తనని తోసుకుంటూ వెళ్ళిపోతుంటే తనకే ఆశ్చర్యం వేసింది. వీళ్ళ అభిమానంలో ప్రేమకూడా ఉందన్నమాట-మళ్ళీ మొదలెట్టాడు.
"మైడియర్ సునందా ..

ఇది ప్రేమలేఖనుకొని నువు చదవకుండా ముక్కలు చేయబోయే ముందు - అలా నువు చేస్తే ఇక్కడ నాహృదయం కూడా అలానే అవుతుందని గుర్తుంచుకో, ఎందుకంటే నిన్ను నేను ప్రేమించాను

" నిన్నే ప్రేమించాను " - అనటం తప్పు. నీకళ్ళని నీ పెదవుల అందాల్ని - చెక్కిళ్ళలోతుల చందాల్ని..." కుర్రవాడికి పొయిట్రి కట్టుబాట్లు తెలుసుననుకుంటూ చివరికంతా గబగబా చదివి, రెండో ఉత్తరం తీసుకున్నాడు.

"సునందినీదేవి గారికి...

ఈ ఉత్తరం నీచేతుల్లోపడదనే ఉద్దేశంతో నాపేరు వ్రాయడంలేదు. కానీ ఇది చదివాక నాకోసం నీవు తప్పక వస్తావు. ఆదివారం ఫిజిక్సు ప్రయివేటు క్లాసులో ఎర్రషర్టుతోఉన్న నన్ను గమనించవలసింది.

నాపేరు............చెప్పను. కానీ నేను నిన్ను ప్రేమించాను

కుర్రవాడిలో మంచి సస్పెన్సుఉంది. అంటూ మూడోదానికి మొదలెటుందో వెదకడం మొదలెట్టాడు. ఆ ఉత్తరం నీట్‌గా వ్రాసిఉన్నా ఐమూలగా ఒక్కో పేరా ఒక్కో త్రికోణంగా వ్రాయబడిఉంది. "మీ నాన్నగారు చాలా మంచివారు" అన్న వాక్యం చదివి నవ్వుకున్నాడు కృష్ణానందం. మీకు టెలిఫోన్ చెయ్యాలని ఉంది. నాకు గొంతు మార్చడం చేతనవును. ప్రమీల అనే పేరుతో పదహారో తేదీ ఉదయం ఫోన్ చేస్తాను. సునందినీ నీకంటే వయసులో ఓసంవత్సరం చిన్నవాణ్ణే...కానీ......కృష్ణానందం గబగబా ఆ ఉత్తరం ముగించి మరోదానితో తారసపడ్డాడు. చించి ఆ ఉత్తరం మొదలెట్టగనే కృష్ణానందం వళ్లు జలదరించింది. పరమబూతులతో వ్రాసిన ఆ ప్రేమలేఖని చదవకుండా ఉండలేక పోయాడు: పైగా ఉత్తరం చివర-సునందా ఇలా వ్రాశానని కోప్పడకు, చాలామంది నా సీనియర్స్ ఇలాంటిపుస్తకాలే చదువుతుండగా చూశాను".

"ఇంకా నయం: ఇది తను తెరవబట్టి సరిపోయింది. ఈ మిగతా ఉత్తరాలన్నీ ఛాయ చదవకపోవడం మంచిదే అయింది".

అనుకుంటూ నిట్టూర్చాడు కృష్ణానందం.

అన్నీ చదివాడు ఓపిగ్గా.

ఆ రాత్రి కృష్ణానందానికి నిజంగా నిద్రపట్టలేదు.

o o o

ప్రతి విషయాన్ని లైట్‌గా తీసుకోవడం కృష్ణానందానికి పరిపాటే: కారణం అతనివృత్తి, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల గురించి: రాబోయే రాచకీయాల మార్గాలను గురించీ వార్తా సముద్రాలని అవుపోసన పట్టిన ఋషిలా ఆళువుల్లాంటి ఎడిటోరియల్స్ రాసి పారేశాడు. ఆ మర్నాడు ఆ న్యూస్ వింటే నిద్ర పట్టదేమో నన్నంత భయం పుట్టించే చాలా న్యూస్ ఐటమ్స్‌కి అవలీలగా హెడ్‌లైన్ వ్రాసి అవతల పారేశేవాడు-అదేదో చాలా అతి సామాన్యమైన విషయమని,

తాసి......ఇది !! డ్రెస్సింగ్ టేబుల్‌దగ్గరవున్న వాడు ఠక్కున లేచాడు.

ఆఫీసుకు పట్టుకెళ్ళదలుచుకున్న పోర్టబుల్ టేప్ రికార్డుల్ని తీసుకెళ్ళడం మర్చిపోతానేమో ననుకొని- అది తీసి ప్లాస్టిక్ బాగ్‌లో వేసి సునందినిని పిలిచి కారులో పెట్టమన్నాడు. ఛాయాదేవి అడిగింది. "క్యారియర్ తెచ్చేవాడిచేత నాకో క్లినిక్ షాంపూ పంపించండి. మనషాపులో అయిపోయాయట, అన్నట్టు మర్చిపోయాను, నాలాక్టోకాలమిన్ కూడా అయిపోయింది".

టై కట్టుకోవడం ఆపి - కృష్ణానందం అన్నాడు. "సాయంత్రం మనింటికి, పెళ్ళిచూపులకి వస్తున్నారు. అమ్మాయిని కాలేజీనుంచి పెందలాడే రమ్మను".

"ఎవరండోయ్... ? నాకింతవరకూ చెప్పనేలేదు, అమ్మ! ఎంత అసాధ్యులండీ మీరూ..." అంది నవ్వుతూ "అవును. నాకు సాధ్యమయితే తప్పకుండా అసాధ్యుణ్ణే అనిపించుకుంటాను. అంటూ కోటుజేబులోంచి ఇన్‌లాండ్ లెటర్ తీసి ఛాయాదేవి కిచ్చాడు.

"ఏమిటిది?"

"రాత్రి నువ్విచ్చిన ఉత్తరాల్లో ఒకటి"

ఛాయాదేవి అటూ ఇటూ చూసి "కొంపదీసి ఆ పెళ్ళిచూపులకి రాబోయే అబ్బాయిది కాదుగదా ఈ ఉత్తరం" అంటూ అందుకుంది.

"కాదు. అమ్మాయికొచ్చిన లవ్ లెటర్స్‌తో బాటు నీకూ వచ్చిన ప్రేమలేఖ ఒకటి పొరపాటున నాకు ఇచ్చావు".

తనచేతిలోంచి జారిపడుతున్న ఉత్తరాన్ని అసహాయంగా చూస్తూ, ఛాయాదేవి తన నీడలోనే తల వంచుకుంది.


# ANDHRA PRADESH STATE FINANCIAL CORPORATION

Invest in 'APSFC' 'Fixed Deposits' and earn maximum returns.

The repayment of principal and interest are guaranteed by State Government.

We offer the following rates of interest on 'Fixed Deposits.'

| Period of Deposit | Rate of interest |
|---|---|
| 1 year and above but less than 3 years | 8% p.a |
| 3 years and above but upto and inclusive of 5 years | 9% p.a. |
| Above 5 years | 10% p.a. |

Minimum amount accepted for initial deposit is Rs. 5,000/-. Further deposits shall be in multiples of one thousand.

For particulars please do write to us or visit our office.

**MANAGING DIRECTOR**

Andhra Pradesh State Financial Corporation.
Post Box No. 165.
5-9-194. Chirag Ali Lane.
Hyderabad-500001.